క్లుప్తంగా

విద్యార్థులు బాగా చదవాలి

నిజామాబాద్ రూరల్: విద్యార్థులు ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడాలని రూరల్ మండల విద్యాధికారి సేవ్‌ల అన్నారు. మంగళవారం ప్రాంగాలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాగ్‌లు, నోట్ బుక్స్ వితరణ చేశారు. కెనరా బ్యాంక్ ఏజీఎం వినోద్ మాట్లాడుతూ.. విద్యార్థుల మంచిగా చదివి జీవితాల్లో ఉన్నత స్థాయికి చేరాలన్నారు. ఉపాధ్యాయులు, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి

ఇందల్వాయి: ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని తిర్మన్‌పల్లిలో మంగళవారం రోడ్డు భద్రతపై సీఐ వినోద్‌రెడ్డి యువకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులకు తీసుకెళ్లరాదని, వాహనదారులు తమ వాహన ధ్రువీకరణ పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి సీఐ సందీప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు

మోపాల్: గ్రామాల్లో ప్రజలు, వ్యాపారులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, వాటితో నేరాలను అదుపు చేయవచ్చని ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. మంగళవారం మండలంలోని న్యాల్‌కల్‌లో గ్రామస్తులకు మత్తు పదార్థాల నిర్మూలన, సైబర్ క్రైమ్ నేరాలు, సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎస్సై నాగభూషణం, జీపీ కార్యదర్శి మల్లేశ్, మహిళా సంఘం, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలి ఫిర్యాదుపై స్పందించిన సీపీ



ఖలీల్‌వాడి: సమస్యపై పోలీస్ క్యాంప్ కార్యాలయానికి చేరుకున్న ఓ వృద్ధురాలి ఫిర్యాదుపై సీపీ సాయిచైతన్య స్పందించారు. వివరాలిలా ఉన్నాయి. ఆర్మూర్‌కు చెందిన వృద్ధురాలు యాదమ్మ తమ బంధువులు దాడి చేశారని సమస్యను పరిష్కరించాలంటు సీపీ కార్యాలయానికి మంగళవారం చేరుకుంది. కాగా సీపీ లేకపోవడంతో కార్యాలయ ఆవరణలో సీపీ కోసం వేచి చూసింది. సాయంత్రం కార్యాలయానికి కారులో వస్తున్న సీపీ వృద్ధురాలిని చూసి ఆమె వద్దకు వెళ్లారు. తమ సమీప బంధువులు పాత కక్షల నేపథ్యంలో తనపై దాడి చేశారని వివరించింది. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ సెలవులో ఉండడంతో ఎస్సై తిరుపతికి సమస్యను విన్నవించినా స్పందించడం లేదని వృద్ధురాలు తెలిపింది. దీంతో సీపీ సమస్యను పరిష్కరించాలంటు ఎస్‌హెచ్‌వోకు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

డిచ్‌పల్లి: మండలంలోని మిట్టాపల్లి గ్రామంలో అక్రమంగా 28 బస్తాల్లో నిల్వ ఉంచిన 11 క్వింటాళ్ల 20 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లై సీనియర్ అసిస్టెంట్ మహేశ్ కుమార్ మంగళవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం మిట్టాపల్లి గ్రామానికి చెందిన చెన్న శ్రీనివాస్ ఇంట్లో తనిఖీ చేయగా లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన రేషన్ బియ్యం పట్టుబడిందన్నారు. దీంతో బియ్యాన్ని సీజ్ చేశామన్నారు. నిందితుడిపై 6ఏ కేసు నమోదు చేసి డిచ్‌పల్లి పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

ఒకరికి నాలుగు రోజుల జైలు

ఖలీల్‌వాడి: మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి కోర్టు నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. నాల్గో టౌన్ పరిధిలో సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మెదక్ జిల్లా పోతపల్లి గ్రామానికి చెందిన రాజు మద్యం తాగి వాహనం నడుపు తూ పట్టుబడ్డాడు. రాజుకు పీఎస్‌లో కౌన్సిలింగ్ ఇచ్చి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరుపర్చగా జైలు శిక్ష విధించినట్లు చెప్పారు.

హత్యకేసులో శిక్షపడుతుందని ఒకరి ఆత్మహత్య

నిజామాబాద్‌రూరల్: రూరల్ పీఎస్ పరిధిలోని కేశాపూర్ గ్రామానికి చెందిన సుంకె గంగాధర్(53) గతంలో చేసిన హత్యకేసులో శిక్షపడుతుందని మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్సై-2 ఆనంద్‌సాగర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని రోజుల క్రితం ఓ హత్య కేసులో గంగాధర్ నిందితుడిగా ఉన్నాడు. ఈ కేసులో శిక్షపడుతుందని మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ప్రేమ్‌లాల్ తన సొంత నిధులతో విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీని మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పుష్ప, ఉపాధ్యాయులు భారతి, జ్యోత్స్న, విద్యార్థులు పాల్గొన్నారు.

కంకర తేలిన సీసీ రోడ్డు

- గుంతల మయంగా మారిన చంద్రశేఖర్ కాలనీ
- ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు
- పట్టించుకోని అధికారులు



గుంతలు పడిన చోట సీసీ రోడ్డు నిర్మాణం



చంద్రశేఖర్ కాలనీలో గుంతలు, కంకర తేలిన రోడ్డు

ఖలీల్‌వాడి : నగరంలోని చంద్రశేఖర్‌నగర్ కాలనీ రోడ్డు గుంతల మాయంగా మారింది. దీంతో ఈ రోడ్డు గుండా ప్రయాణించే వాహనదారులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డుపై వాహనాదారులు ఎక్కువ సంఖ్యలో రాకపోకలు కొనసాగిస్తుండడంతో రోడ్డుపై గుంతలు ఏర్పడి కంకరరాళ్లు పైకి తేలాయి. దీంతో పలు వాహనదారులు వీటి గుండా ప్రయాణించినప్పుడు అదుపుతప్పి కిందపడి గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. అంతేకాకుండా ఈ గుంతల్లో వర్షపు నీరు నిలువ ఉండడంతో ఏ చోట గుంత ఉందో తెలియడం లేదు. దీంతో వాహనాదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా రోడ్డుపైనే పలువురు చెత్త వేస్తుండడంతో దుర్వాసన అధికంగా వస్తోంది. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి, దుర్వాసన వస్తున్న చెత్త కుప్పలను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది



చంద్రశేఖర్‌కాలనీలోని రోడ్డు గుంతలు, కంకర తేలడంతో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వాహనాలు చెడిపోతున్నాయి. పాదచారులు సైతం నడవడానికి ఇబ్బంది పడుతున్నారు. వర్షం పడితే ఎక్కడ ఏ గుంత ఉందో తెలియడం లేదు. అధికారులు స్పందించి రోడ్డును నిర్మించాలి.

– మోహన్, చంద్రశేఖర్ కాలనీ, నిజామాబాద్

అడవుల సంరక్షణ సామాజిక బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ భిక్షపతి

ధర్పల్లి: అడవుల సంరక్షణ సామాజిక బాధ్యత అని, భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ అడవులను రక్షించాలని ధర్పల్లి సీఐ భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం అటవీ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. అటవీ భూముల వివాదాలు, వాటి పరిష్కారాలపై అధికారులు చర్చించారు. అటవీ శాఖ భూములకు సంబంధించి వివాదాలు తలెత్తినప్పుడు పోలీసులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని పోలీస్ అధికారులు అటవీ శాఖ అధికారులకు సూచించారు. ఒకరికొకరు సహకారం చేసుకొని అటవీ భూములు ఆక్రమణకు గురికాకుండా కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి సీఐ వినోద్ రెడ్డి, ఎస్సైలు రామకృష్ణ, ఎల్ రామ్, సందీప్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానితులు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలి



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎస్సై గంగాధర్

ఖలీల్‌వాడి: కాలనీలోకి కొత్తగా వచ్చిన వారితో పాటు అనుమానితులు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ సూచించారు. నగరంలోని రేణుకనగర్‌లోని రోడ్డు నెంబర్-1లో కాలనీవాసులకు పోలీసులు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై తన సిబ్బందితో కలిసి కాలనీని పరిశీలించారు. ప్రజలు నేరాలు, దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. శాంతిభద్రతలు కాపాడడంలో ప్రజలు పోలీసులకు సహకారం అందించాలన్నారు. కాలనీలో సీసీటీవీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాలనీకి ఇన్‌చార్జిగా పోలీస్ కానిస్టేబుల్ రవిని నియమించామని ఏవైనా సమస్యలు ఉంటే 9912983825, లేదా డయల్ 100కు సమాచారం అందించాలన్నారు.

డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి



సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన నాయకులు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని, అలాగే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ రైల్ నిలయంలో జనరల్ మేనేజర్ కార్యాలయంలో పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజేశ్వర్ మాట్లాడుతూ.. డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే రోగులు, మండల కార్యాలయాలకు గ్రామీణ ప్రాంతాల ప్రజలు ప్రమాదకరంగా పట్టాలపై, రైలు బోగీల కిందనుంచి వెళ్లాల్సి వస్తోందన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని డిచ్‌పల్లిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని, ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయి కిరణ్, వంశీ, రాజేంద్ర ప్రసాద్, జై తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి



అంగన్‌వాడీ కేంద్రంలో కొత్తగా చేరిన చిన్నారితో సెల్ఫీ ఫొటో తీసుకుంటున్న సీడీపీవో, సూపర్‌వైజర్లు

డిచ్‌పల్లి: మూడు సంవత్సరాల వయసు రాగానే పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సీడీపీవో రామగిరి జ్యోతి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని డిచ్‌పల్లి ఖిల్లా గ్రామంలో మంగళవారం అమ్మ మాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ప్రయివేటు వద్దు.. అంగన్‌వాడీ ముద్దు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. చిన్నారులు ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, వారికి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలపై తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాలను అందంగా అలంకరించి కొత్తగా చేరిన పిల్లల సెల్ఫీ పాయింట్ (మై ఫస్ట్ డే)లో ఫొటోలు తీశారు. ఫ్రీ స్కూల్ కిట్, పిల్లల ఆటవస్తువుల గురించి తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శోభ, బుజ్జి, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం సాయిలు, హెల్త్ సూపర్‌వైజర్లు దేవపాలం, ఏఎన్‌ఎంలు దేవీమేరి, శోభాకుమారి, అంగన్‌వాడీ టీచర్లు అనిత, స్వప్న, సురేఖ, శుభంరాణి, స్రవంతి, రాజమణి, ఆశావర్కర్లు వేదవతి, శోభ, లలిత, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

డిచ్‌పల్లి: వర్షాకాలం ప్రారంభమైనందున వనమహోత్సవంలో భాగంగా నాటేందుకు అన్ని గ్రామ నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలని డిచ్‌పల్లి ఎంపీడీవో బుక్య లింగం నాయక్ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఉపాధి హామీలో కొత్తగా చేర్పించిన పనులపై జీపీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.300 వచ్చేలా చూడాలన్నారు. ఎకరం నుంచి 5 ఎకరాల వరకు ఉన్న రైతుల భూముల్లో హార్టికల్చర్ ద్వారా పండ్ల తోటల పెంపకం దరఖాస్తులు స్వీకరించాలన్నారు. అలాగే ప్రతి ఇందిరమ్మ ఇంటికి ఇంకుడు గుంత, వ్యక్తిగత మరుగుదొడ్డి తప్పకుండా ఉండేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, ఏపీవో మంజుల, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ సుధాకర్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు ఉమేశ్, పరమేశ్వర్, సాయికుమార్, అరుంధతి, ఆపరేటర్లు అన్నపూర్ణ, అనూష, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, మేట్లు తదితరులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తుల పంపిణీ

నిజామాబాద్‌అర్బన్: బడిబాటలో భాగంగా మంగళవారం కోటగల్లి జీపీఎస్ పాఠశాల విద్యార్థులకు నిజామాబాద్ సౌత్ మండల విద్యాశాధికారి సాయిరెడ్డి ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కృష్ణారావు, హెచ్‌ఎంలు మల్లేశం, రామచందర్ గైక్వాడ్, ఉపాధ్యాయులు దయానంద్, సంతోష్, నందిని పాల్గొన్నారు.

పాఠశాలల పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



మోపాల్: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఎంఈవో గేమ్‌సింగ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, పారిశుధ్య కార్మికులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. పాఠశాల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. రిసోర్స్ పర్సన్ గంగా ప్రసాద్ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, కార్మికులు పాల్గొన్నారు.

కళాశాలలో యోగాపై అవగాహన

నిజామాబాద్‌అర్బన్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మంగళవారం నాగారంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో యోగాపై అవగాహన, ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. యోగా శిక్షకులతో సామూహిక యోగాసనాలు వేయించారు. జిల్లా ఆయుష్ నోడల్ అధికారి జె గంగాదాస్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సయ్యద్ హైదర్, సూర్యకాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు, ఆయుష్ ఫార్మసిస్టులు పురుషోత్తం, ఉమాప్రసాద్, యోగా శిక్షకులు విజయ భాస్కర్, రాజేందర్, సిబ్బంది రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు ప్రారంభం

డిచ్‌పల్లి: రాష్ట్రంలో ఇల్లు లేని పేదలు ఉండకూడదనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని డిచ్‌పల్లి మండలం బీబీపూర్ గ్రామ ప్రత్యేకాధికారి, మండల పశువైద్యాధికారి గోపికృష్ణ అన్నారు. మంగళవారం బీబీపూర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు ముగ్గు వేసి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి గౌతమి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ బదావత్ బలరాం, జరుపుల రవీందర్, సర్దార్, రవీందర్, బానోత్ మహిపాల్, కారొబార్ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి విగ్రహ పున:ప్రతిష్ఠాపన

ధర్పల్లి: మండల శివారులో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని గ్రామస్తులు పున: ప్రతిష్ఠాపన చేశారు. గ్రామస్తులు బోనాలను ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారికి వేడుకున్నారు.

రేపు టై ఉమెన్ రోడ్ షో

నిజామాబాద్ అర్బన్: ఈ నెల 19న టై ఉమెన్ రోడ్ షో నిర్వహిస్తున్నట్లు జిల్లా కేంద్రంలోని ఐటీ హబ్ అధికారులు తెలిపారు. టై ఉమెన్- 2025 గ్లోబల్ ప్రోగ్రాంలో భాగంగా మహిళా పారిశ్రామిక వేతలకు మెంటరింగ్, ఇన్వెస్టర్లకు కనెక్ట్ చేయడం, లరినింగ్ ప్రోగ్రామ్స్‌ను అంతర్జాతీయ వేదికలకు పరిచయం చేయాలన్న ఉద్దేశంతో రూపొందించామని తెలిపారు. 19న మధ్యాహ్నం 1.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఐటీ హబ్ నుంచి టై ఉమెన్ రోడ్ షో ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు 6305396427 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

స్లాటర్‌హౌస్‌ను పరిశీలించిన అధికారులు



నిజామాబాద్ సిటీ: కార్పొరేషన్ పరిధిలోని స్లాటర్ హౌస్‌ను నిర్మల్ జిల్లాకు చెందిన బల్దియా అధికారులు పర్యటించారు. మంగళవారం నాగారంలోని బాబన్ సాహెబ్ పహడ్‌లోని పశు, మేకల వధశాలను అధికారులు పరిశీలించారు. నిర్మల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, డిప్యూటీ ఈఈ హరిభువన్ గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మేకల దేవిదాస్, ఖురేషీ సొసైటీ సభ్యులు అబ్దుల్ సమద్ ఖురేషీ, ఖాలీఫ్ ఖురేషీ, సాజిద్ ఖురేషీ, జాహెద్ ఖురేషీ, ఫహీం ఖురేషీ, సద్దాం ఖురేషీలతో కూడిన బృందం పరిశీలించింది. నిర్మల్ మున్సిపల్‌లో నూతనంగా నిర్మించనున్న స్లాటర్ హౌస్ కోసం మోడల్‌ను, స్లాటర్‌హౌస్ నిర్మాణం, వసతులు, మురుగునీరు, పశువుల వ్యర్థాల తొలగింపు ప్రక్రియను పరిశీలించారు. మున్సిపల్ శానిటరి సూపర్‌వైజర్ సాజిద్ అలీ, ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, కృష్ణ, జవాన్లు ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్ సుడిగాలి పర్యటన



కంఠేశ్వర్‌లో సులభ్‌కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ దిలీప్‌కుమార్



సంజీవ్‌రెడ్డి కాలనీలో..

నిజామాబాద్ సిటీ : నగరంలో మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ సుడిగాలి పర్యటన చేశారు. మంగళవారం ఉదయం 5 నుంచి 8 గంటల వరకు పలు డివిజన్లలో పర్యటించారు. సర్కిల్-1, 2, 3, 4-ఎ, 4-బి, 5 సర్కిళ్ల పరిధిలోని డివిజన్లలో క్షేత్రస్థాయిలో పర్యటించి శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్‌తో కలిసి పారిశుధ్య పనులను పరిశీలించారు. కంఠేశ్వర్‌లోని పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ చూశారు. జోన్-5లో కార్మికుల హాజరును పరిశీలించారు. బోర్గాం(పి), కంఠేశ్వర్, వినాయక్‌నగర్, గాయత్రినగర్, గౌతమ్‌నగర్, అర్సపల్లి, ఖలీల్‌వాడి, కంఠేశ్వర్ బైపాస్, పులాంగ్, ఆర్యనగర్‌లో పర్యటించారు. ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు. కాలువలు, పెద్ద డ్రెయినేజీల్లో చెత్తను తొలగించాలని సూచించారు. దోమలు వ్యాపించకుండా లార్వాలను నాశనం చేసేవిధంగా స్ప్రే చేయాలన్నారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, షాదుల్లా, సునీల్, జవాన్లు, సిబ్బంది ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మార్నింగ్ వాక్‌లో స్థానికులతో కలిసి పాల్గొన్న సీఐ, ఎస్సై

సిరికొండ : డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ధర్పల్లి సీఐ భిక్షపతి సూచించారు. మండల కేంద్రంలో యువతతో కలిసి పోలీసులు సామూహిక మార్నింగ్ వాక్, పోలీసు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రతి గల్లీలో మూడు కిలో మీటర్ల మేర మార్నింగ్ వాక్ నిర్వహించారు. అనంతరం తెలంగాణ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడ్డారు. వాకింగ్‌లో పాల్గొన్న యువతకు రాగి మాల్ట్‌ను పంపిణీ చేశారు. సీఐ మాట్లాడుతూ.. యువకులు ప్రతి రోజు వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. గ్రామాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలన్నారు. ప్లాస్టిక్ నిరోధానికి కృషి చేయాలన్నారు. ఎస్సై ఎల్ రామ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాకారం రవి, బీజేపీ జిల్లా కార్యదర్శి నక్క రాజేశ్వర్, మాజీ సర్పంచ్ రాజారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రవీణ్, ఆసిఫ్, దిగంబర్, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు దీపక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు జీపీఎఫ్ వర్తింపజేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్: విద్యుత్ సంస్థలో 1999 నుంచి 2004 వరకు నియామకమైన ఉద్యోగులకు జీపీఎఫ్ వర్తింపజేయాలని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ రఘునందన్ కోరారు. ఈ మేరకు పవర్ ఎంప్లాయిస్ సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ లేఖను ఉప ముఖ్యమంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ, ట్రాన్స్ కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు పంపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల ఉద్యోగులు, ఇంజనీర్లు నిబద్ధతతో పని చేస్తున్నారని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడం వల్లే వేసవిలో పంటలు బాగా పండాయని అభినందించారు. జీపీఎఫ్ అంశాన్ని ఉప ముఖ్యమంత్రికి పంపిస్తానని, సీఎం, శాసనసభలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే విద్యుత్ సంస్థల్లో పని చేసే ఉద్యోగులకు 2004 వరకు జీపీఎఫ్ వర్తింపజేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్తానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం జేఏసీ చైర్మన్ రఘునందన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంపై తమకు నమ్మకముందని, విద్యుత్ ఉద్యోగుల ఎంప్లాయిస్ ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.కోటీ అందిస్తున్నందుకు ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ బాలేష్‌కుమార్, కో కన్వీనర్ తోట రాజశేఖర్, ఈపీఎఫ్ టు జీపీఎఫ్ నాయకులు శ్రీనివాస్, శ్రీరామ్ మూర్తి, మల్లేశ్, బాశెట్టి సురేశ్‌కుమార్, గంగారాం నాయక్, రాజేందర్, చంద్రశేఖర్, శంకర్ నాయక్, సతీష్, హరికృష్ణ, శ్రీనివాస్, రాంగోపాల్, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి



తిర్మన్‌పల్లి హాస్టల్‌లో స్ప్రే చేస్తున్న సిబ్బంది

ఇందల్వాయి: దోమలను నివారించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని, దుస్తులను పూర్తి స్థాయిలో ధరించాలని ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్ సూచించారు. మంగళవారం మండలంలోని తిర్మన్‌పల్లిలో ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలలో ఏసీఎం స్ప్రే చేశారు. దోమల వల్ల కలిగే వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గున్యా, మెదడువాపు వంటి వ్యాధుల నివారణ కోసం స్ప్రే చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి రాజేందర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	99,000	వెండి(కిలో)	1,09,500
22 క్యారెట్స్	91,390		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	క్యాప్సికం	50	90
బెండకాయ	30	50	గాజరుగడ్డ	30	60
బీరకాయ	50	70	పచ్చిమిర్చి	50	80
దొండకాయ	25	50	దోసకాయ	20	40
బీర్నీసుకాయ	70	110	ఆలుగడ్డ	30	50
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	30	60	గోబిపువ్వు	40	60
పాలకూర	80	120	బీట్‌రూట్	30	60
మెంతికూర	70	110	కరివేపాకు	40	60
కొత్తిమీర	40	60	చామగడ్డ	30	50
పుదీనా	70	100	చిక్కుడుకాయ	40	60

–సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
- స్క్రీన్-1 తొలిప్రేమ-11.00,1.30,4.30,7.30, 10.30
- స్క్రీన్-2 అందాల రాక్షసి-11.00, 4.30
- హౌస్‌ఫుల్-5(హిందీ)-1.35, 7.30, 10.30
- హౌస్‌ఫుల్-5(హిందీ)-1.35, 7.30, 10.30
- స్క్రీన్-3 అందాల రాక్షసి-10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
- స్క్రీన్-1 హౌటూట్రైన్ యువర్ డ్రాగన్ (3డీ)-11.00, 1.45, 4.30
- హౌటూ ట్రైన్ యువర్ డ్రాగన్ (3డీ ఇంగ్లీష్)-7.15,10.00
- స్క్రీన్-2 హౌస్‌ఫుల్-5(హిందీ)-10.10, 4.25
- జాన్ విక్-5-1.40
- జాన్ విక్-5(ఇంగ్లీష్)-7.55, 10.40
- ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-1.10
- స్క్రీన్-3 ది హంటర్: చాప్టర్-1-11.10
- ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-1.50
- జాన్‌విక్-5-4.20
- హౌస్‌ఫుల్-5(హిందీ)-7.05, 10.35
- పాడేరు 12 మైలు-8.00
- స్క్రీన్-4 జాన్‌విక్-5-11.30
- కట్టప్ప జడ్జిమెంట్-2.15 - పాప-4.50
- అందాలరాక్షసి-7.35, 10.45

దేవి తొలిప్రేమ **నటరాజ్** హౌస్‌ఫుల్-5 (హిందీ)

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆర్మూర్ సి. ప్రభాకర్ ACO : 9010585333
నిజామాబాద్ అర్బన్ & రూరల్ జి. రాంబాబ్ : 9849180084
బాల్కొండ ప్రవీణ్ : 7893150102
బోధన్ ఎ.శివ : 9848956776
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899